Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699


అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 169 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 10 - 2 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకూడదు... ముందస్తు చర్యలు తీసుకోండి

**- హాస్టల్ విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే కలెక్టర్లు, మంత్రులదే బాధ్యత - నార్మల్ డెలివరీలు పెరిగేలా అవగాహన కల్పించండి - త్వరలో పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ - గత పాలకుల తప్పిదాల వల్ల అధిక వడ్డీలు చెల్లిస్తున్నాం - క్షేత్ర స్థాయిలో పర్యటించి... పాలసీల అమలు పరిశీలించండి - మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు**






**అమరావతి, (రాజధాని వార్తలు):** వేసవి కాలం రానున్న నేపథ్యంలో నీటి ఎద్దడి అనేది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇప్పటి నుంచే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూసుకోవడంతోపాటు... పశువుల దాణాకూ సమస్యలు రాకూడదని సీఎం చెప్పారు. మరోవైపు ప్రజాసమస్యలు-పాలనా తీరు తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పాలసీల అమలు క్షేత్ర స్థాయిలో ఎలా ఉందనే దానిని ప్రత్యక్షంగా చూడాలన్నారు. పైస్థాయిలో ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా... క్షేత్ర స్థాయిలో పాలసీలు సమర్ధవంతంగా అమలు కానప్పుడు ఆశించిన ఫలితాలు రావని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ వర్గాల ప్రజలతో అధికారులు తరుచూ మాట్లాడుతూ ఉంటే చాలా సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలి. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుంది. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలి. క్షేత్ర స్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండు సార్లు పరిశీలన చేసుకోవాలి. పీ 4 అనేది రాష్ట్రంలో ఆర్ధిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం. మార్గదర్శులు బంగారు మిత్రలను నియమించుకోవాలి... వారి ద్వారా ఆయా పేద కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాలన్నీ రీషెడ్యూలు చేస్తున్నాం. గత పాలనలో పాలకులు 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారు. జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టాం... సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. భవిష్యత్తులో ఆ జిల్లాలు మరింత వృద్ధిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు ఉత్పత్తికి అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు కశ్మీర్లో మాత్రమే కుంకుమ పువ్వు ఉత్పత్తి జరుగుతోంది. అలాగే దేశంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు సమీపంలో కోకో సిటీ కూడా ఏర్పాటు అవుతుంది. కాఫీ సాగు పెంచటంతో పాటు అరకు కాఫీ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాం.. ఇది మరింతగా పెరగాలి." అని సీఎం చంద్రబాబు వివరించారు.

**జూలై కల్లా 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్**

"సంజీవని ద్వారా జూలై 2026 నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలి. 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల స్క్రీనింగ్ చేపట్టాలి. 12వ తరగతి వరకూ ఉన్న 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ కూడా తయారు చేయాలి. కేర్ అండ్ గ్రో ద్వారా మాతా శిశు ఆరోగ్యం, ఎదుగుదలను నమోదు చేయాలి. పౌష్టికాహారం అందించటంతో సహా అవసరమైన సప్లిమెంట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి. అవిశ, మునగ, రకరకాల ఆకు కూరల్లో పౌష్టికాహారం లభిస్తుంది. వాటిని ఆహారంగా తీసుకోవడం మానేయడం వల్లనే సమస్యలు వస్తున్నాయి. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లలో కూడా పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి. ఇక గర్భిణీల విషయంలో నార్మల్ డెలివరీలు పెరిగేలా చూడాలి... సిజేరియన్లు తగ్గాలి. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్రమైన కార్డు జారీ చేస్తాం. మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. జనాభా విషయంలో చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య బాగా పెరిగిపోయింది. యూరోప్‌లోని దాదాపు 20 దేశాల్లో ఈ సమస్య ఉంది. అక్కడ సామాజిక వేడుకలే లేవు." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఒత్తిడి లేని విద్యాబోధనే లక్ష్యంగా...**

"పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేయాలి. పరీక్షలు అంటే ఎలాంటి ఒత్తిడి లేని విధంగా ఈ కార్యాచరణ ఉండాలి. ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోడానికి వీల్లేదు. ఒత్తిడి లేని విద్యా విధానంతోనే కొత్త ఆలోచనలు వస్తాయి... సరికొత్త ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది. వయోజన విద్యలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా డ్వాక్రా మహిళల సహకారం తీసుకోవాలి. కేంద్రం అమలు చేస్తున్న కర్మయోగి పథకంలో ఏపీకి చెందిన వారే అగ్రస్థానంలో ఉన్నారు. సామాజిక బాధ్యత కింద ప్రైవేటు సంస్థలు యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంపై దృష్టి పెట్టాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా స్కిల్లింగ్ తో పాటు ఉద్యోగాలు ఏ మేరకు వస్తున్నాయనే అంశాన్నీ పర్యవేక్షించాలి. రాష్ట్రంలో 38,608 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల దగ్గర నీటి నిల్వలకు అనుగుణంగా ప్రణాళికలు చేయాలి.

చెరువులు, కాల్వలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలి. దీంతో పాటు డీసిల్టింగ్, అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్‌లను తవ్వాలి, నిల్వలు పెరిగేలా చూడాలి ప్రస్తుతం 7.34 భూగర్భ జలాలు ఉన్నాయి. నీటి బ్యాంకు తరహాలో భూగర్భ జలాలు వినియోగం జరగాలి. వాటిని సద్వినియోగం చేసుకుంటేనే మెరుగైన ఫలితాలు సాధించగలం." అని సీఎం వివరించారు.

**జీ రామ్ జీ పనులపై కార్యాచరణ సిద్ధం చేయాలి**

"పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. ఆశ్రమ హాస్టల్‌లో కలుషితమైన నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇక రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మంత్రులదే బాధ్యత. పంచాయితీరాజ్ రోడ్లు, నీటి సంరక్షణా చర్యలు, గోకులం షెడ్లు, మేజిక్ డ్రెయిన్లు చేపట్టాలి." అని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వాప్‌కాన్ - 2026








**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన మహిళల ఆయుర్వేద జాతీయ సదస్సు - వాప్‌కాన్ 2026 ఘనంగా జరిగింది. ఈ రెండు రోజుల సదస్సులో దేశవ్యాప్తంగా సుమారు 1000 మంది ఆయుర్వేద వైద్యులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు అతిథులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ NCISM చైర్‌పర్సన్ డాక్టర్ మణీషా కోథేకర్ ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ పీవీఎన్ మాధవ్ జీ - బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు (ఏపీ), విశ్వ ఆయుర్వేద పరిషత్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహేష్ వ్యాస్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రేమానంద రావు రాష్ట్ర అధ్యక్షులు ఐతీ మాధవరావు చౌదరి మరియు విశ్వ ఆయుర్వేద పరిషత్‌కు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని సదస్సును ఘనతపరిచారు. మహిళల ఆయుర్వేద వైద్యుల సాధికారత, ఆయుర్వేద అభివృద్ధి, విధానపరమైన చర్చలు, ఆరోగ్య రంగంలో మహిళల పాత్రను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించబడింది. సదస్సులో మహిళా ఆయుర్వేద వైద్యులు మరియు జీవ వైవిధ్య రంగంలో సేవలందించిన మహిళా సాధకులను సత్కరించారు. ఆయుర్వేద విద్య, పరిశోధన, ఆరోగ్య సేవల విస్తరణ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ విధానాలు, ఆయుష్మాన్ భారత్ పథకం, ఉపాధి మరియు స్టార్టప్ అవకాశాలపై కీలక చర్చలు జరిగాయి. సదస్సు భాగంగా నిర్వహించిన ఆయుర్వేద ఎక్స్‌పోలో 50కి పైగా వైద్య సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాయి. ఈ సదస్సును కన్వీనర్ డాక్టర్ సాహితి నాయకత్వంలో విజయవంతంగా నిర్వహించగా, వాప్‌కాన్-2026 మహిళల ఆయుర్వేద వైద్యులకు ఒక బలమైన వేదికగా నిలిచి, ఆయుర్వేద భవిష్యత్ దిశను నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు.




# స్థానిక పత్రికలకు వెరిఫికేషన్ వేధింపులు నిలిపి వేయాలి - పిజిఆర్ఎస్‌లో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఫిర్యాదు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సర్క్యులేషన్ 5వేలు దాటిన స్థానిక పత్రికలను సర్క్యులేషన్ వెరిఫికేషన్ (పరిశీలన) చేస్తామంటూ సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారుల వేధింపులను నిలుపుదల చేయాలని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ళ విద్యాధరిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గతసారి, అంతకుముందు వెరిఫికేషన్ చేశారని మళ్లీ వెరిఫికేషన్ అవసరం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ ఎలాంటి వెరిఫికేషన్ లేకుండానే ప్రెస్ అక్రిడిటేషన్లు జారీ చేస్తున్నారని జాయింట్ కలెక్టర్‌కి తెలిపారు. వెరిఫికేషన్ అనివార్యం అనుకుంటే అన్ని కేటగిరీల పత్రికలకు చేయాలి తప్ప కేవలం స్థానిక పత్రికలను టార్గెట్ చేయటం సబబు కాదన్నారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీకి సమాచార శాఖ అధికారులు తప్పుడు సమాచారం ఇస్తూ సమగ్రంగా

చర్చించకుండా ఇలాంటి నిర్ణయాలు తగవన్నారు. తొలి సమావేశంలో పలు స్థానిక దినపత్రికలకు కొన్ని రెన్యువల్ అక్రిడేషన్లు కూడా నిలుపుదల చేశారన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ కలెక్టర్ దృష్టిలో ఉంచుతామని సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. రాష్ట్ర బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి రూ.200 కోట్లు కేటాయించాలి. ఈనెల 11 నుండి జరగబోవు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జర్నలిస్టుల సమస్యలపై చర్చించాలని వారి సంక్షేమానికి రూ.200 కోట్లు నిధులు కేటాయించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మరో వినతి పత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపే నిమిత్తం ప్రజా వ్యాధుల పరిష్కార వేదికలో అందజేశారు. ఎన్నికల మేనిఫెస్టో హామీ వరకు జర్నలిస్టులకు 4 సెంట్ల చొప్పున ఉచితంగా ఇళ్ల స్థలాలు, ఇతర రాష్ట్రలలో మాదిరిగా 10వేల పింఛన్ సదుపాయం, నాన్ ఎం ప్యానల్ పత్రికలకు, 10వేల లోపు సర్క్యులేషన్ కలిగిన ఎంప్యానల్డ్ దినపత్రికలకు ప్రెస్ అక్రిడేషన్ల పెంపు, జర్నలిస్టులపై దాడుల నివారణకు అటాక్స్ కమిటీలు ఏర్పాటు, ప్రమాద బీమా రూ 10 లక్షల పెంచి అమలు తదితర సమస్యలను వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి పంపుతామని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు బాలభాను, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్, ఆర్.అబ్బాస్, ఎం.శ్రీహరి, ఎన్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సంఘాలుగా ఏర్పడాలి

**- వ్యవసాయంలో అధిక ఆదాయం వచ్చే గ్రామాలుగా, జిల్లాగా తీర్చిదిద్దాలి - రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి - విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్థికంగా చేయూత - లాభసాటి పంటల దిశగా ఆలోచనలు చేయాలి - జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి - రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి**

**కురుపాం, (రాజధాని వార్తలు):** రైతులు సంఘాలుగా ఏర్పడాలని, మరింత ఆదాయం పెరిగేలా, అధిక ఆదాయం వచ్చే దిశగా రైతులు గ్రామాలను, జిల్లాను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఆకాంక్షించారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని, విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్థికంగా చేయూతనిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం కురుపాం మండలం రస్తకుంటు భాయి గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'కిసాన్ మేళా' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ఒకచోట చేరి, వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధిపై చర్చించుకునే వేదిక కిసాన్ మేళా అని గుర్తుచేశారు. ఇతర గ్రామాలతో పాటు జిల్లా, రాష్ట్రం, దేశంలో వ్యవసాయ రంగంలో జరిగే మార్పులు, సాధించిన విజయాలపై తెలుసుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని చెప్పారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. రైతు బజార్లు, వరి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర, జీడి మామిడిని కొనుగోలు చేయడానికి వాల్యూయాడెడ్ ఫ్యాక్టరీని పెట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అలాగే ఎరువులు,



క్రిమిసంహారక మందుల్ని ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా మీ గ్రామంలోనే అందించేలా ఏర్పాటు చేసిందని తెలిపారు. వ్యవసాయంలో సహాయం చేయడానికి ఆర్ఎస్కెలలో మీకోసం ఒక అగ్రికల్చర్ అసిస్టెంట్‌ని నియమించిందని, విత్తనాలని సబ్సిడీ మీద ఇస్తోందని చెప్పారు. మందుల పిచికారీ కొరకు డ్రోన్లను తీసుకొచ్చిందని, తద్వారా రోజుల్లో జరిగే పనిని కేవలం గంటల వ్యవధిలో చేస్తుందని అన్నారు. అలాగే రైతుల కొరకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, టిల్లర్స్ ఇస్తున్నారని, ఐటీడిఏ ద్వారా అనేక పరికరాలు గతంలో ఇచ్చామని, ఇలా ప్రభుత్వం నుంచి అడుగడుగునా సహాయం ఉందని కలెక్టర్ గుర్తు చేశారు. అయినప్పటికీ రైతుగా మీ బాధ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, ప్రభుత్వం అందించే సహాయాలన్నింటినీ పొందాలని సూచించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఏ విధంగా వృద్ధి చెందాయో, అదే మాదిరిగా రైతులందరూ కూడా ఒక సంఘంగా ఏర్పడి, రైతులు నిర్ణయించిన ధరకు విక్రయించు కోవచ్చని అన్నారు. అంతేగాని రైతుల కష్టాన్ని మధ్యలో దళారీ లాభం పొందకూడదని సూచించారు. భూసారానికి తగిన పంటలు,అధిక దిగుబడులు, రాబడి వచ్చే లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించాలని అన్నారు. అంతకుముందు కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను విప్‌తో కలిసి పరిశీలించి, శాస్త్రవేత్తలతో చర్చించారు. వ్యవసాయ శాఖ రూపొందించిన బ్రోచర్లను కలెక్టర్ అతిథులు, అధికారులతో కలిసి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కురుపాం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని కిసాన్ మేళా కార్యక్రమంలో చెప్పారు. శాస్త్రవేత్తలు సూచించిన పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, మెరుగైన రాబడి సాధించవచ్చని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాయని, రైతులందరూ వీటిని అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ వంటి కార్యక్రమాల్లో ముందుగా స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ–పిఎం కిసాన్ వంటి పథకాలతో పాటు విత్తనం నుంచి పంట విక్రయాల వరకు ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకుంటున్న సంగతిని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆర్.రాజ్యలక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్ కె.కళావతి, చింతపల్లి ఏడీఆర్ డా.అప్పలస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి ఆర్.అన్నపూర్ణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. ఎస్.మన్మథరావు, డీఈ శివన్నారాయణ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## మాయాబజార్ చిత్రమాలిక పుస్తకావిష్కరణ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ విజేత పి రాజేశ్వరరావు మాయాబజార్ సినిమాపై పెన్సిల్‌తో చిత్రించిన 100 చిత్రాలతో రూపొందించిన ప్రత్యేక సంచికను విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వైవిధ్యంగా అత్యంత నైపుణ్యంగా చిత్రాలను రూపొందించినందుకు రాజేశ్వరరావును ఎమ్మెల్యే అభినందించారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటరీ విభాగం తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం, చిత్రకారుడు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

**- నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు 45 రోజుల శిక్షణ - మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉచిత శిక్షణకు సంబంధించిన వివరాలను మంత్రి ఫరూక్ వెల్లడించారు. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) ద్వారా మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నీట్, ఈఏపీ సెట్‌ల పోటీ పరీక్షల్లో ఉన్నతమైన మార్కులను సాధించి, మంచిర్యాంకులతో వైద్య, ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా తదితర అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ కోర్సులు) కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు వీలుగా మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్ లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో 45 రోజుల పాటు అందించడం జరుగుతుందన్నారు. నీట్, ఈఏపీ సెట్‌ల శిక్షణలో నిష్ణాతులైన అధ్యాపకుల చేత బోధనా తరగతులు నిర్వహించడం జరుగుతుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సీఈడీఎం వెబ్ సైట్: www.apcedmmwd.org లేదా విజయవాడ సీఈడీఎం కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే cedmap2017@gmail.com, ఫోన్ నెంబర్:0866–2970567, మొబైల్ నెంబర్ :73867 89966 సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని మైనారిటీ మంత్రి ఫరూక్ తెలిపారు.



## మక్కువలో రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన

**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ గ్రామంలో గల ప్రధాన రహదారి విస్తరణకు నేడు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ మరియు గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. సుమారు రెండు కోట్ల 64 లక్షల అంచనా వ్యయంతో స్థానిక మజ్జి గౌరమ్మ కోవెల నుండి సువర్ణముఖి నది వంతెన వరకు రోడ్డు విస్తరణ మరియు కాలువల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల 64 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఆ పనులను త్వరితగతిన పూర్తయ్యేలాగా చర్యలు చేపట్టాలని నాణ్యతలో ఎటువంటి రాజి పడొద్దు నిధులు ఇంకా ఏమైనా అవసరమైతే ప్రభుత్వం నుండి మంజూరయ్యేలాగా కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. శంకుస్థాపన అనంతరం మజ్జి గౌరమ్మ ఆలయం నుండి మెయిన్ రోడ్ వరకు తెలుగుదేశం కార్యకర్తలు నాయకులతో కలిసి నడుచుకుంటూ ప్రజలకు అభివాదం చేస్తూ చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుళ్ళ వేణుగోపాలరావు మరియు మక్కువ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పి మల్లేశ్వరరావు మరియు యువ నాయకుడు దాసరి కేశవ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాలకు పూర్వవైభవం కోసం కృషి చేయాలి

**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన డొంకాడ బాలకృష్ణను ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ గురజాడ పేరుతో గల జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పూర్వ వైభవం తేవాలని, జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలలో విద్యార్థులు చదువుకునేందుకు మంచి పుస్తకాలతో పాటు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను సత్కరించారు.



## మన్యం కళావేదికపై 'కథా సమ్మేళనం', 'థింసా' నృత్య పోటీలు

**- ఫిబ్రవరి 13న "కథా సమ్మేళనం" - ఫిబ్రవరి 28న "థింసా నృత్య పోటీలు" : జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడి**



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** మన్యం కళావేదికపై ఈ నెలలో రెండు ప్రధాన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడించారు. గిరిజన సంస్కృతిని, కళలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను రూపొందించడం జరిగిందని అన్నారు. మన్యం సంస్కృతి, అభ్యుదయ భావాలు, నైతిక విలువలను ప్రతిబింబించేలా లఘు కథల పోటీ కథా సమ్మేళనం ఈ నెల 13వ తేదీన సాయంత్రం 4:00 గంటలకు మన్యం కళావేదికపై ఉంటుందన్నారు. ఆసక్తి గల రచయితలు తమ కథలను 2 పేజీలకు మించకుండా రాయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు తమ వివరాలను మరియు కథలను ఈ నెల 10వ తేదీలోపు నోడల్ ఆఫీసర్ శ్రీ రాజు ఫోన్/వాట్సాప్ నంబర్ : 99499 64997కు పంపాలని చెప్పారు. వచ్చిన కథలలో ఉత్తమమైన వాటిని సమ్మేళనానికి ఎంపిక చేస్తామని తెలిపారు. అలాగే ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2:00 గంటల నుంచి థింసా నృత్య పోటీలు మన్యం కళావేదికపై జరగనున్నాయని అన్నారు. ఈ పోటీలు కేవలం గ్రామ స్థాయి బృందాలకు మాత్రమే నిర్వహించబడతాయని అన్నారు. కావున ప్రతీ గ్రామం నుంచి థింసా బృందాలు తమ వివరాలను నోడల్ ఆఫీసర్ శ్రీ రాజు ఫోన్/వాట్సాప్ నంబర్ : 99499 64997కు పంపి నమోదు చేసుకోవడంతో పాటు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. ఈ పోటీల్లో పాఠశాల బృందాలకు, విద్యార్థులకు అవకాశం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కావున ఈ రెండు పోటీల్లో ఆసక్తి గల గిరిజన కళాకారులు, రచయితలు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం

**- అభివృద్ధిపై ప్రతీనెలా సమీక్షా సమావేశాలు : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. 20 సూత్రాల కార్యక్రమంపై సమీక్ష అనంతరం శనివారం ఆయన కలెక్టరేట్లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం పాలనను పర్యవేక్షిస్తూ, త్రాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, రెవెన్యూ సేవలు తదితర రంగాల్లో ర్యాంకులు కేటాయిస్తు, అభివృద్ధిలో జిల్లాల మధ్య అంతర్గత పోటీ పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా ఐ.వి.ఆర్.ఎస్ సర్వే ద్వారా ప్రజాభిప్రాయాన్ని నిత్యం తెలుసుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా ప్రతీ మూడు నెలలకోసారి కలెక్టర్లతో సమావేశాలను నిర్వహిస్తూ జిల్లాల ప్రగతిపై సమీక్షిస్తున్నారని తెలిపారు. వాటికి అనుగుణంగా జిల్లా ర్యాంకును మెరుగుపరిచేందుకు తమవంతు కృషి చేస్తున్నామని చెప్పారు. దీనికోసం ప్రతీనెలా జిల్లాలో సమీక్షా సమావేశాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా గతం కంటే 40 శాతం అధికంగా, ఈ ఏడాది సుమారు 4.53 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, అంతేకాకుండా 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోలు పట్ల రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం త్వరలో 100 టన్నుల పోర్టిఫైడ్ కెర్నర్ రైస్ రానుందని ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి తెలిపారు. వచ్చేవారం మరో 200 టన్నులు వస్తుందన్నారు. సుమారు వెయ్యి టన్నుల కెర్నర్ రైస్ అవసరమని, దానిని తెప్పించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు.

# ముత్తుకూరు ఎంఇఓని సత్కరించిన దూడల పెంచలయ్య









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ మండల విద్యా శాఖధికారిగా పురస్కారం అందుకున్న ముత్తుకూరు మండల విద్యా శాఖాధికారి మధుసూదనను మర్యాద పూర్వకంగా మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య శాలువాతో సత్కరించారు. అదే క్రమంలో మహాజ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆయనతో పాటు రెండవ మండల విద్యా శాఖాధికారి నున్నా హేమ సుందర్‌కి అందుచేసి వారి నుండి ఆశీస్సులు తీసుకోవడం జరిగిందని దూడల పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏఎస్పీ దీక్ష





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపేలా చర్యలు ఉంటాయంటున్న నెల్లూరు పోలీసులు. ప్రతి ఆదివారం ఉదయం 11 గంటలకు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని రౌడీ షీటర్లకు ఆదేశంటాప్ 10 రౌడీ షీటర్లలో ముగ్గురిపై పీడీ యాక్ట్ నమోదుకు రంగం సిద్ధం.గంజాయి సమాచారం కోసం 'ఈగిల్ క్లబ్' 190729 నంబర్‌ను సంప్రదించాలని ఏఎస్పీ సూచన.డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా త్వరలో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తాం. రేపటి నుంచి నగర వ్యాప్తంగా భారీ కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించ



నున్న పోలీసులు. నిబంధనలకు విరుద్ధంగా తెరిచే వైన్ షాపులు, బార్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక.

# పాచిపెంట మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక



**పాచిపెంట, (రాజధాని వార్తలు):** తేదీ 7/2/2026 న పాచిపెంట మండల పత్రిక విలేకరులు సమైక్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ యొక్క సమావేశంలో కొత్త కార్యవర్గం న్నీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కొత్త కార్యవర్గ ఎన్నికకు ఎన్నికల అధికారిగా సీనియర్ సభ్యుడు దండి ఏడుకొండలు నిర్వహించారు. కొత్త కార్యవర్గం అధ్యక్షుడిగా యజ్జవరపు గౌరీశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గొట్టపు తిరుపతిరావు, గొల్లపల్లి బాబ్జి, కార్యదర్శిగా పాచిపెంట ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా లావేటి ఈశ్వరరావు, కోశాధికారిగా చిట్టూరి వెంకటరమణమూర్తి, గౌరవ అధ్యక్షులుగా దండి ఏడుకొండలు, సమన్వయకర్తగా పాచిపెంట సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఆరంగి రమేష్, బుర పైడిరాజు, పడాల వెంకటరమణ, ఎస్ఆర్‌టిపి ప్రసాద్ రాజు, నిమ్మకాయలు మనోజ్, వాకుబార్ల రాజశేఖర్, మల్లీ గోవిందరావు, గ్రంధి వెంకటరమణ తో కూడిన కార్యవర్గాన్నే ఏకగ్రీవంగాఎన్నుకోవడం జరిగిందని సీనియర్ పాత్రికేయులు దండి ఏడుకొండలు, నల్లి గోవిందరావు తెలిపారు.

# జోరుగా అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్సిపి అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు మండలంలో జోరందుకుంది. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ బొత్స అప్పల నరసయ్య ఆదేశాలతో క్లస్టర్ ఇన్చార్జులు తమ తమ పరిధిలోని పంచాయతీలను నిత్యం పర్యవేక్షించి కమిటీల ఏర్పాటులో స్పీడ్ పెంచారు. దీంతో మండలంలో కమిటీల ఏర్పాటు వేగవంతంగా సాగుతుంది. శనివారం మరుపల్లి క్లస్టర్లో ఇంచార్జ్ కరణం ఆదినారాయణ, మాజీ సర్పంచులు రెడ్డి పద్మావతి, గెద్ద రమేష్ సమక్షంలో కమిటీలు ఏర్పాటు పూర్తి చేశారు. ఈనెల 15 తేదీలోపు కమిటీలు మొత్తం పూర్తి చేయాల్సి ఉందని పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు తెలిపారు.



# గుమళ్లదిబ్బ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ప్రశాంతమ్మ పరామర్శ

**- ఫోన్ చేసి పరామర్శించిన ఎమ్మెల్యే - బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ - ఘటనపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు**



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండలం గుమళ్లదిబ్బ కొత్త కాలనీలో బాలిక మృతి ఘటనపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే ఆమె స్పందించి చెన్నైలో ఉన్న బాధిత కుటుంబ సభ్యలను ఫోన్ ద్వారా పరామర్శించారు. బాలిక తల్లిదండ్రులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి తాను అన్నివిధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఘటనపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా యస్.పి. డా.అజిత వేజెండ్ల, ఐపిఎస్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశంను నిర్వహించారు. స్మార్ట్ పోలీసింగ్ ద్వారా ఆధునిక సాంకేతికత, డేటా విశ్లేషణ, సీసీటీవీ నిఘా, డ్రోన్లు మరియు డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లను వినియోగించి నేరాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించవచ్చు.? జిల్లా అధికారులకు ఖఖు ద్వారా, జిల్లా వ్యాప్తంగా ఉన్న FRS (Face Recognition System) కెమెరాలు, దాని ఉపయోగాలు గురించి అవగాహన కల్పించారు. సిసి కెమెరాలు టెక్నాలజీ ఉపాయోగించుకొని మిస్సింగ్ కేసులులో తప్పి పోయన ట్రేస్ చేయడంలోను, నేర చరిత్ర ఆధారంగా పాత నేర గాళ్ళ కదలికలు గుర్తించడం తద్వారా సదరు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టంస్ నుండి పొందే అలెర్ట్స్ ద్వారా పాత నేరస్తులను పట్టుకోవడంలో ఈ టెక్నాలజీ ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే విషయాలపై అవగాహన కల్పించారు. గ్రేవ్ కేసులలో నిర్ణీత గడువు లోపల విచారణ పూర్తి చేసి, ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు. పిజిఆర్ఎస్ పిటిషన్లను తక్షణమే పరిష్కరించండి. డయల్ 112 కాల్స్‌కు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలి.? ప్రతి కేసులో టెక్నీకల్ ఎవిడెన్స్ సేకరించి దర్యాప్తు చేయాలి. తద్వారా కన్విక్షన్ రేటు పెంచవచ్చు. ఓపెన్ డ్రింకింగ్ ద్వారా నేరాలను నియంత్రించవచ్చ కావున ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశాలు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా పెంచి, అతిక్రమిస్తున్న వారి బెయిల్ రద్దు చేయించి కోర్టు ద్వారా మరలా రిమాండ్‌కు పంపించాలి. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలి. ఇతర ప్రభుత్వ విభాగాలతో కలసి బ్లాక్ స్పాట్స్ సందర్శించి తగు చర్యలు తీసుకోవాలి. డ్రోన్ సర్వైలెన్స్ విరివిగా చేయాలని ఆదేశాలు. అదేవిధంగా ముఖ్యమైన అన్ని ప్రాంతాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించి, తప్పక ఏర్పాటు చేసుకునేలా చూడాలి. అనుమానిత ప్రాంతాలలో కార్డన్ ఆపరేషన్స్ నిర్వహించాలని ఆదేశాలు. మిస్సింగ్ కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే చేధించాలని ఆదేశాలు. విలేజ్ విజిట్ అందరూ తప్పక చేయాలని ఆదేశాలు.. తద్వారా రాబోయే సమస్యలను అరికట్టవచ్చు.. పరిష్కరించవచ్చు. రాత్రి పూట అన్ని స్టేషన్లలలో గస్తీలు ముమ్మరం చేయాలనీ, అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచనలిచ్చారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ & నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, పోస్కో రేప్ కేసులు, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 Cr.P.C కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డిపిఓకు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, పెండింగ్ NBWs, NDPS కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జనవరి నెలలో గుడ్ వర్క్ చేసిన అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రసంసా పత్రాలు అందచేశారు. ఈ సమావేశం నందు జిల్లా యస్.పి.తో పాటు అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, టౌన్ ఏఎస్పీ దీక్ష, ఐపిఎస్, జిల్లాలోని డిఎస్పీలు, ఇతర జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. దశమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం శ్రీవారి సుప్రభాత సేవ, నిత్య ఆరాధన, బాలభోగ నివేదన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. అనంతరం సస్య సమృత్యర్థం, అన్న సమృత్యర్థం, సర్వ సంపత్ సమృత్యర్థం, శ్రీవారి తిరుప్పావడ సేవ, అన్న కుటోత్సవం భక్తిశ్రద్ధలతో గావించారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ఉమాదేవి దంపతులు, రమ్య, నీరజ మన్నే భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సర్టిఫికెట్లను అందుకుంటున్న భాష్యం లిటిల్ ఛాంప్స్ స్కూల్ విద్యార్థులు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మధురవాడ బ్రాంచ్ భాష్యం లిటిల్ ఛాంప్స్ స్కూల్ విభాగం విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. శనివారం మధురవాడలోని భాష్యం లిటిల్ ఛాంప్స్ స్కూల్లో ప్రీప్రైమరీ యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించారు. ఈ వేడుకలకు స్కూల్ ప్రిన్సిపాల్ పి.రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలను అందించారు. చిన్నా రులు పట్టాలను అందుకొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మొల్లేటి జ్యోతి, స్కూల్ సిబ్బంది మరియు విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పల్లె కథా భారతి

గడిచిన ఆరేడేళ్ల కాలంలో కథా ప్రక్రియకు సంబంధించి తెలుగు సాహిత్య యువనికపై ఎండపల్లి భారతి అనే వేగుచుక్క పొడిచింది. 2018లో 'ఎదారి బతు కులు' పేరిట 30 కథల సంపుటి, 2021లో 'బతుకీత' పేరుతో 20 కథల సంపుటి, 2023లో 'జాలారి పూలు' పేరిట మరో 20 కథల సంపుటి గాక, అదే ఏడాది 'జక్కీకు' నవల, గత ఏడాది 'దేవరహస్యాలు' కథా సంపుటి వెలువరించి కథా స్రవంతితో అలజడి సృష్టించింది. ఎలిమెంటరీ స్కూలు దాటని ఒక పల్లెపడుచు, అందులోనూ మాదిగపల్లె ఆడపిల్ల, పన్నెండేళ్లకే పెళ్లై సంసార సాగరంలో నెట్టబడ్డ ఒక వెనుకబాటుకు గురైన ప్రాంతపు ఆడపిల్ల, ఇంత తక్కువకాలంలో ఇన్ని కథలు రాయటమే కాదు 40 వేల కాపీలు అమ్ముడయ్యే 'నవోదయం' పత్రిక సంపాదకవర్గ సభ్యురాలిగా ఉంది, ఒక సినిమాతోపాటు, మరికొన్ని లఘు చిత్రాలు నిర్మించిందంటే నమ్మలేం. కాని అది నిజం. గతంలో నామిని 'మిట్టూరోడి' భాషను చూసి చిత్తూరు జిల్లా భాషలో ఇంత మాధుర్యముందా! అనుకొని చిత్తయిన పాఠకులు ఎండపల్లి భారతి మదనపల్లె ప్రాంతపు (దిగువ బురుజు) మాండలికానికి అబ్బురపడ్డారు, ఆస్వాదించారు. భారతి కథల్లో తాత్వికత, కథనంలో కళాత్మకత, జీవం, జనజీవిత విస్తృతి ఉన్నాయి. బూతు మాటలు, సామెతలు కథలో అలవోకగా ఇమిడిపోవటమేగాక అశ్లీలత ఛాయలు ఎక్కడా కనపడవు. కులవివక్ష, లింగవివక్ష అత్యంత సహజంగా చూపటంలో భారతి కథన కౌశలం అపూర్వం. గ్రామీణ జీవితంతో సంబంధం ఉన్న పాఠకులకు మన పక్కన రోజూ జరిగిన విషయమంత సహజంగా, పల్లె జీవితంతో సంబంధంలేని పట్టణ వాసులకు అబ్బురంగా అన్పించే కథలు ఇవి. 'ఎదారి బతుకులు' పుస్తకానికి ముందుమాటలో ఇండస్ మార్టిన్ అన్నట్లు, "ఈ భూ ప్రపంచకం మొత్తం మీద ఏ మూలకి వెళ్లినా ఆడోళ్లు దిగనాసితనంలోకి తోసెయ్యబడ్డాళ్లే. ఈ దేశపు ఆడోళ్లు మరికాస్త ఎక్కువ తోసెయ్యబడ్డవాళ్లే. ఇందులో మళ్లీ మా దళితగూడెం ఆడోళ్లు బయట సమాజంలో కులం పేరుతో, ఇంట్లో మొగాళ్ల చేతుల్లో ఆడంగితనం పేరుతో, మిగతా కులాల ఆడోళ్ల మజ్జనేవెూ కులంతోపాటు బీదరికాన్నిబట్టీ మొత్తంగా ఈసడించుకోబడుతున్నారు. మా గూడెపు మొగోడు తనతోపాటు సమానంగా బువ్వ సంపాదిచ్చే, తనకన్నా ఎక్కువగానే గుడిసెను భద్రం చేసుకునే దళిత స్త్రీలపట్ల చూపించే 'మగతనం' భారతి కథల్లో మిగతా స్త్రీవాద సాహిత్యంలోని నిందా దృక్పథంతో కాకుండా నిస్సహాయత వ్యక్తం చేస్తూ వివక్షను ఎత్తిచూపుతుంది". ఏ ప్రక్రియలో అయినా క్లుప్తత సుందరంగా ఉంటుంది. రాయటంలోనూ, మాట్లాడటంలోనూ "తక్కువ" చాలా ఎక్కువమందిచే ఆకర్షింపబడుతుంది. భారతి రాసిన కథల్లో నేను చదివిన 72 కథల్లో ఒక్క 'మా ఇంటికొచ్చిన నల్లపెట్ట' అనే కథ మాత్రమే ప్రింటులో 17 పేజీలుంది. మిగిలిన 71 కథలూ నాలుగైదు పేజీలే. భారతి కథల్లో కన్పించే ఈ క్లుప్తసుందరత కూడా పాఠకుల్ని ఆకర్షించటానికి ఒక కారణం కావచ్చు. టమాటా (అవగూద కాయలు) పంట పేరిట జూదం, పురుగు మందు పేరిట భూమితల్లి కడుపు విషంతో నింపటం, దుడ్లుపెట్టి నీళ్లు కొనే కాలంలో చొమ్ము (చెంబు) నీళ్లు పుట్టని వైనం, నీళ్ల కడవెత్తమంటే అంతలావు మొగున్ని మోస్తారు గాని నీళ్ల కడవ మొయ్యలేరా అని చెతురాడే ఆడాళ్లు, ఇత్తడి బిందె కొన్న మల్లమ్మని చూసి "మా తాగుబోతు నాబట్ట ఎంత నోరుకొట్టుకొని చెప్పినా పైసా మిగిలిస్తే కదా కూలి దుడ్లంతా నా సాడు తాగేదానికే సరిపోతుండే" అని బాధపడే ఇల్లాలు, "నేనూ నా బిడ్డా కడుపు కట్టుకుని కూడేసిన దుడ్లతో తెచ్చిన ఇత్తలి బిందె నక్కా ముక్కాట కోసం నీ ఎదాన పెట్టుకుంటివే" అని వాపోయిన మల్లమ్మ, కసువుకి పోయి రెడ్డికి చిక్కి "ఓయప్పా నేను ఈ పొద్దే బయట ఉన్నాను. నా దగ్గరకొచ్చి ఏమన్నా అయితే చెడ్డపేరు. మూడుదినాలైనాక ఈటికే వస్తా నీ పని గడపతానని" తప్పించుకున్న ఆడది, సావు గుంత కాడ దానమిచ్చిన వడ్లను తెచ్చి సంకటి చేసి తిన్నంక సావు బియ్యం తినకూడదని ఆనెంక తెల్సుకున్న ఆమెకి "సావు బియ్యమూ బతుకు బియ్యమూ అని వుండవు. కాలే కడుపును సల్లార్చే బియ్యమే వుంది" అని ఓదార్చిన బోయ కొండవ్వ... ఇలా పల్లెలో ప్రతి మనిషీ, పల్లె చుట్టూ జరిగే ప్రతి ఘటనా భారతి కథల్లో కదురుకున్నాయి. ఈ కథల కాలంలో వచ్చిన కరోనా, పెద్దనోట్ల రద్దు కూడా కథలుగా మారాయి. సమస్త పల్లె జీవితాల్ని సవిస్తారంగా కథల రూపంలో మన ముందు పరిచింది ఎండపల్లి భారతి. ప్రచారం వలనో, మార్కెట్ మాయాజాలం వలనో, ఇతరేతర కారణాల వలనో లక్షల పుస్తకాలు అమ్ముడుపోవచ్చు. కాని అవి పాఠకుల మన్నన పొందిన దాఖలాలు లేవు. యాదృచ్ఛికంగా భారతి ఒక్క కథను చదివినా మిగిలిన కథల్ని ఆ కథే చదివిస్తుంది. మిగిలిన పుస్తకాల్ని కొనిపిస్తుంది. సాహిత్య ప్రక్రియల్లో కథ, కవిత్వం పాఠకుల్ని కోల్పోతున్న వర్తమాన కథా స్రవంతిలో ఇలా చదివించిన రచయిత్రి భారతే!

# తిరుపతి లడ్డుపై రాజకీయమా : ప్రియాంక దండి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులున్న కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామితో రాజకీయాలు వద్దు అని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజక వర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదలైన ఈ వివాదం ఇప్పటి వరకు ముగియలేదని, ఎంతో ఇష్టంగా తినే తిరుపతి లడ్డు ప్రసాదం, ఈ వివాదం కారణంగా భక్తులు అనుమానంతో సేవిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది తప్పు జరిగి ఉంటే నిందితులను అరెస్ట్ చేయచ్చుకదా, ఇంతవరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదు? మీడియా సమావేశాలు నిర్వహించి ఎంత కాలం ఆరోపణలు చేస్తారు, వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డులో జంతు కొవ్వు కలిపారని మొదట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోపించారు, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, హోమ్ మంత్రి అనిత బాత్రూమ్‌లో వాడే కెమికల్స్ కూడా వాడారు అంటున్నారు, ఇది అప్పుడు ఎందుకు చెప్పలేదని, లడ్డులో ఏం కలిపారో ల్యాబ్ రిపోర్ట్‌లో అప్పుడు స్పష్టంగా నిర్ధారించలేదా భక్తులను తప్పుద్రోవ పట్టిస్తున్నారా శ్రీవారిని అవమానిస్తున్నారని ప్రియాంక కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. శ్రీవారి లడ్డు మీద రాజకీయాలు చేయడం దుర్మార్గం అని రాష్ట్రంలో కొందరు జంతు కొవ్వు కలిసింది కలుషితమైందని కొందరు నమ్ముతుంటే, ఎలాంటి తప్పు జరగలేదని కొందరు నమ్ముతారని నిజం నిర్ధారించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది, కాని ఆరోపణలతో కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని రాజకీయాలకు వాడుకుంటోందని ప్రియాంక అన్నారు.

# తూర్పు జోన్ అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ

### - జోనల్ స్థాయి సమీక్షలో వెల్లడించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తూర్పు నియోజక వర్గం అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ చేపట్టడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబుతో కలసి ఈస్ట్ జోన్ అభివృద్ధి, పలు సమస్యలపై ఈస్ట్ జోన్ కార్పొరేటర్లు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, పి.నల్లనయ్య, డివి రమణమూర్తి, ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఏ ప్రభాకర్ రావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ఇతర జీవీఎంసీ ఈస్ట్ జోన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ముందుగా తూర్పు నియోజకవర్గంలో ఉన్న వార్డులలోని కార్పొరేటర్లు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈస్ట్ జోనకు సంబంధించి ఆయా జోనులు వారీగా కార్పొరేటర్లు వార్డులలో భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు చాలాచోట్ల వేయవలసి ఉందని, తాగునీటి సమస్య అధికంగా ఉందని, కాలువలు క్రాసింగ్ లైన్ల వద్ద తాగునీటి పైప్ లైన్‌లు కలుషితం కాకుండా సరిదిద్దాలని, కొండవాలు ప్రాంతాలలో విద్యుత్తు స్తంభాలు, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని, ఉన్న వీధిలైట్లను పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు చేపట్టాలని, శ్మశాన వాటికలు, దోభీఖాణాలు, పార్కులు, రోడ్ల విస్తరణ, రోడ్లు, కాలువలు మరమ్మత్తులు, రక్షణ గోడలు, కల్వర్టులు నిర్మించాలని, పారిశుద్ధ్య కార్మికులు, చెత్త తరలించే వాహనాలు కొరత ఉన్నందున కార్మికులు, వాహనాల సంఖ్య పెంచాలని, ప్రధాన కాలువలలోని పూడికలు తొలగించాలని, కొండవాలు ప్రాంతాలలో మెట్లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, 24×7 పైప్ లైన్లు వేయాలని, కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాలు, పలు వార్డులలో నిర్మించాలని, పలు జంక్షన్లను అభివృద్ధిపరిచి సుందరీకరణ పనులు చేపట్టాలని, పలుచోట్ల మున్సిపల్ స్థలాలను ఆక్రమణకు గురి కాకుండా రక్షణ గోడ ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకు వచ్చి వాటిని పార్కులుగా అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన చోట్ల కమర్షియల్ నిర్మాణాలు చేపట్టి జీవీఎంసీ ఆదాయం పెంపుకు కృషి చేయాలన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ మహా విశాఖపట్నం నగరపాలక సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులతో పరిపాలన సౌలభ్యం కొరకు పది జోన్లుగా విస్తరించి జనవరి ఒకటి నుండి ఆయా జోన్లలో కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే జోన్ల అభివృద్ధిపై ప్రత్యేకమైన కార్యచరణ చేపట్టేందుకు ఒక నూతన కార్యచరణ చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలపై, పలు సమస్యల పరిష్కారంపై అన్ని వార్డులలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు, జోనల్ కమీషనర్‌కు కమీషనర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్లు, కార్య నిర్వాహక ఇంజనీర్లు, ఏసీపీలు, జోనల్ అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు పిల్లల స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ అమలు చేయాల్సిందే

### - కళాశాలల్లో ఫీజులలో రాయితీ కల్పించండి - ఉచిత ఆరోగ్య పరీక్షలు సద్వినియోగం చేసుకోండి - జిల్లా కలెక్టర్‌కు ఫెడరేషన్ తరపున ధన్యవాదాలు - ఫెడరేషన్ సభ్యత్వ నమోదులో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజుకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్ 50% ఫీజు రాయితీ కల్పించారని అయితే కొన్ని పాఠశాలలు వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని జాతీయ జర్నలిస్టులు సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు అన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవో హోంలో శనివారం వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లకు సంబంధించి పలువురు వర్కింగ్ జర్నలిస్టులకు నూతన సభ్యత్వాలు నమోదు చేయడంతో పాటు మరికొందరు తమ రెన్యువల్స్ పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ కొన్ని స్కూల్స్ లో కలెక్టర్ ఆదేశాలు అమలు చేస్తున్నారన్నారు. స్కూల్ ఫీజులో 50% రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. కానీ కొన్ని స్కూల్స్ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ డీఈవో ప్రేమ్ కుమార్ దృష్టికి కూడా పలు సందర్భాల్లో తీసుకు వెళ్లినట్లు చెప్పారు. సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులు పిల్లలకు 2014 నుంచి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. అది కూడా విశాఖ నుంచే ప్రారంభమైందన్నారు. అలాగే నారాయణ. చైతన్య వంటి కొన్ని కళాశాలలు జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో కొంతమేరకు రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. అయితే చాలా కళాశాలలు ఫీజులు తగ్గించడానికి ఇష్టపడటం లేదన్నారు. కావున ఈ విషయమై కళాశాలల యాజమాన్యాలు జర్నలిస్టుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని వీరు కోరారు.

**11 నుంచి ఉచిత ఆరోగ్య పరీక్షలు**

ఈనెల 11 నుంచి విశాఖ జిల్లా అధికార యంత్రాంగం అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు మరియు ఆరోగ్యానికి సంబంధించిన వైద్య తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్‌కు తమ యూనియన్ల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం భీమిలిలో నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం తిరిగి ఏపీఎన్జీవోహంలో నిర్వహిస్తామని అదే రోజు ముగింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, ఫెడరేషన్ నేతలు పి. నగేష్ బాబు, రాజశేఖర్, బొబ్బర ప్రసాద్ తదితరులంతా పాల్గొన్నారు.

# విస్తృతంగా డెకాయ్ ఆపరేషన్‌లు చేపట్టాలి

### - సమన్వయ కమిటీ సమావేశంలో ఆర్డీవో రమణి




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఆడ శిశువుల పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించేందుకు డెకాయ్ ఆపరేషన్లు ముమ్మరం చేయాలని పెద్దాపురం ఆర్డీవో కే శ్రీరమణి పిలుపునిచ్చారు. పెద్దాపురం రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్‌డీవో శ్రీ రమణి, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియెట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్విని యోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. ఆల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించు కోవడం చట్టరీత్యా నేరమని, డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పిండ లింగ నిర్ధా రణ చట్టంపై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తగా గర్భిణీ స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌లోనూ పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులను, వాల్ పోస్టర్లను, ధరల పట్టిక, ఫిర్యాదుల కొరకు వాట్స్ యాప్ ఫోన్ నెంబర్ 9494113365, టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-3365 ను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దాపురం డివిజన్‌లో ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ ప్రక్రియ పిండ లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేసినట్లయితే వారికి మూడు సంవత్సరాల శిక్ష, పది వేల రూపాయల ఫైన్‌తో పాటు స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని జిల్లా పెద్దాపురం రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీరమణి అధికారులను ఆదేశించారు. సమావేశంలో పెద్దాపురం డివిజన్ అధికారి డా.ఎన్.ప్రశాంతి మాట్లాడుతూ మొదటిసారి ఈ చట్ట పరిధిలో చేసిన ఏదేని తప్పుకు (అతిక్రమణకి) 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా, రెండవసారి ఈ చట్ట పరిధిలో చేసిన ఏదేని తప్పుకు 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష రూ. 50 వేలు జరిమానా విధించబడుతుందన్నారు. పై శిక్షలతో పాటు వైద్యుల మొదటి అతిక్రమణకు భారత వైద్య మండలి లేదా రాష్ట్ర వైద్యులు సంఘం నుండి న్యాయస్థానంలో పిర్యాదు నమోదు చేయబడి, దాని పరిష్కారము కోర్ట్ ద్వారా జరిగే వరకు వారి పేరు మండలి రిజిస్టరు నుండి ఉపసంహరించబడటం లేదా నిలిపి వేయబడటం జరుగుతుందన్నారు. అలాగే నేర నిర్ధారణ జరిగితే వారి పేరు వైద్య మండలి రిజిస్టర్ నుండి 5 సంవత్సరాల వరకు తొలగింపబడుతుందని తెలిపారు. పెద్దాపురం డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 41 స్కానింగ్ సెంటర్లపై నిరంతరం డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతుం దన్నారు. లింగ సమానత్వంపై ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో పెద్దాపురం డివిజన్ ఆఫీసర్ డా.ఎన్.ప్రశాంతి, స్వచంద సంస్థ ప్రతినిధులు పళ్ళ వాసవి, లోక్ అదాలత్ సభ్యులు వెంకటాచలం, హై కోర్ట్ లాయర్ సత్యా రవి కుమార్, డాక్టర్స్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యాంగబద్ధంగా నూతన మేయర్ ఎన్నిక జరపాలి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాశే హక్కు ఎవరిచ్చారని వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. తక్షణం రాజ్యాంగబద్ధంగా నెల్లూరు నూతన మేయర్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘ ఐక్యవేదిక చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవా రంతో ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గిరిజన సంఘానికి వేదికకు రైతు సంఘం, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ లఐక్యవేదిక, బిఎస్‌పి పార్టీల నాయకులు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అణగారిన వర్గాలను అణిచివేడివే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ముఖ్యంగా నెల్లూరు మేయర్ పదవి గిరిజన మహిళకు రాజ్యాంగబద్ధంగా కల్పిస్తే, దీనిని చూసి ఓర్వలేక జిల్లా నాయకులు మరో కులానికి చెందిన వ్యక్తికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించటం బాధాక రమన్నారు. ఇదేనా బడుగు బలహీన వర్గాలకు ఇచ్చే గౌరవం అంటూ ఆయన ప్రశ్నించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాసిన భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ గత మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి రెండు నెలలు కావస్తున్న ఇంతవరకు నూతన మేయర్ ఎన్నికలకు నోటిఫికేషన్ రాకపోవడం శోచనీయం అన్నారు. విశాఖపట్నంలో ఒక న్యాయం నెల్లూరులో ఒక న్యాయమా అంటూ ఆయన మండిపడ్డారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ కూడా స్పందించి వెంటనే నూతన మేయర్ ఎన్నికపై నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ఆ జోనర్‌లో యష్ మరో మూవీ? ఈసారి తెలుగులో?



రాకింగ్ స్టార్ యష్.. ఇప్పుడు టాక్సిక్ మూవీతో థియేటర్స్‌లో సందడి చేసేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. గీతా మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. మరికొద్ది రోజుల్లో విడుదల అవ్వనుంది. మార్చి 19వ తేదీన వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఇప్పటికే టాక్సిక్‌పై భారీ అంచనాలు ఉండగా.. యష్ ఎలాంటి హిట్ అందుకుంటారోనని అంతా వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు యష్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధ మవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టాక్సిక్ తోపాటు బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ప్రెస్టేజియస్ ప్రాజెక్టు రామాయణలో రావణాసురుడి పాత్రలో నటిస్తున్నారు యష్. అయితే ఇప్పుడు మరో మైథలాజికల్ కథాంశంతో రూపొందనున్న మూవీపై ఆయన చర్చలు జరుపుతున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఫిక్స్ అయితే.. యష్ కెరీర్‌లో అదే తొలి డైరెక్ట్ తెలుగు చిత్రం. ఇప్పటివరకు డబ్బింగ్ సినిమాల ద్వారా మాత్రమే తెలుగు ప్రేక్షకులను అలరించిన యష్.. ఇప్పుడు డైరెక్ట్ టాలీవుడ్ సినిమాతో సందడి చేయనున్నారన్నమాట. నిజానికి కేజీఎఫ్ సిరీస్ చిత్రాలతో ఆయన.. ఒక్కసారిగా పాన్ ఇండియా క్రేజ్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో కేజీఎఫ్ తర్వాత యష్ చేసే సినిమాలపై అందరి ఫోకస్ పడింది. దీంతో స్క్రిప్ట్, రోల్స్ విషయంలో ఎంతో జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకుంటున్న ఆయన.. నార్మల్ కమర్షియల్ స్టోరీల కంటే పాన్ ఇండియా రేంజ్ సబ్జెక్టులకే ఇంపార్టెన్స్ ఇస్తున్నారని వినికిడి. అందులో భాగంగా ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్న మైథలాజికల్, పీరియాడిక్ బ్యాక్ డ్రాప్స్ ఉన్న కథలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బాలీవుడ్ రామాయణ కోసం ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నారని, సినిమాలో పవర్ ఫుల్‌గా యష్ కనిపిం చనున్నారని సమాచారం. ఆ మూవీ ఇంకా విడుదల కాకముందే ఆయన యాక్టింగ్‌పై ఆడియన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో మరో మైథలాజికల్ కథతో తెలుగు దర్శకుడు ఆయనను సంప్రదించినట్లు టాలీవుడ్‌లో టాక్ రావడం విశేషం. ఆ సినిమాను భారీ విజువల్స్, అదిరిపోయే సెట్స్, మోడ్రన్ టెక్నాలజీతో రూపొందేలా ప్లాన్ చేస్తున్నారని వినికిడి. పాన్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని వివిధ భాషల్లో తెరకెక్కించే ఆలోచనలో ఉన్నారని సమాచారం. ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ చర్చల దశలోనే ఉన్నప్పటికీ, అన్నీ అనుకూలంగా జరిగితే త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. దీంతో రామాయణ తర్వాత మరో పౌరాణిక కథతో యష్ ప్రేక్షకుల ముందుకు రానున్నారా అన్న ప్రశ్నకు సమాధానం తెలియాలంటే కొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

# దుమ్ము దులుపుతున్న కొత్త ప్రేమకథ



విత్ లవ్.. గత శుక్రవారం తమిళంతో పాటు తెలుగులో ఒకేసారి విడుదలైన సినిమా. కేవలం పాతికేళ్ల వయసులోనే 'టూరిస్ట్ ఫ్యామిలీ' లాంటి హృద్యమైన సినిమా తీసి మెప్పించిన అభిషాన్ జీవింత్.. 'విత్ లవ్'తో హీరోగా మారాడు. 'టూరిస్ట్ ఫ్యామిలీ'లో కూడా మంచి పాత్ర చేసి మెప్పించిన అతను.. ఇందులో లీడ్ రోల్‌లో నటించాడు. మలయాళంలో తక్కువ సినిమాలతోనే మంచి గుర్తింపు సంపాదించిన అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించింది. తమిళంలో ఈ సినిమా ఓ మోస్తరు అంచనాలతో రిలీజైంది. తెలుగులో ఈ పేరుతో సినిమా వస్తున్న సంగతే తెలియదు. కానీ రిలీజ్ రోజు ఈ చిత్రానికి చాలా మంచి స్పందన వచ్చింది. చూసిన వాళ్లందరూ సినిమా సూపర న్నారు. పాజిటివ్ రివ్యూలు వచ్చాయి. దీంతో రెండో రోజు నుంచి ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేస్తోంది. తొలి రోజు రూ.2 కోట్ల వసూళ్లు రాబట్టిన 'విత్ లవ్'.. రెండో రోజు రూ.4 కోట్ల మేర కలెక్ట్ చేయడం విశేషం. మూడో రోజు వసూళ్లు ఇంకా పెరిగాయి. మొత్తంగా మూడు రోజుల్లో రూ.11 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది 'విత్ లవ్'. ఈ సినిమా బడ్జెట్ కేవలం రూ.4 కోట్లు. దీన్ని ప్రొడ్యూస్ చేసింది సూపర్ స్టార్ రజినీకాంత్ చిన్న కూతురు సౌందర్య కావడం విశేషం. మదన్ అనే కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించాడు. తెలుగులో కూడా ఈ సినిమా అంతకంతకూ పుంజుకుంటోంది. గత వీకెండ్లో 'యుఫోరియా' సహా అరడజనుకు పైగా తెలుగు సినిమాలు రిలీజ్ కాగా.. అవేవీ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపో యాయి. 'విత్ లవ్'యే బాక్సాఫీస్ దగ్గర లీడ్ తీసుకుంది. వేలంటైన్స్ డే వీకెండ్లో కూడా ఈ సినిమా దుమ్ము దులిపేలా ఉంది. పెట్టుబడి మీద ఫుల్ రన్లో పది రెట్ల వసూళ్లు వస్తాయని బాక్సాఫీస్ పండిట్లు అంచనా వేస్తున్నారు. పెళ్లి చూపుల్లో భాగంగా కలిసిన ఒక జంట.. తమ వన్ సైడ్ లవ్ స్టోరీల గురించి చెప్పుకుంటాయి. తమ ప్రేమను అవతలి వ్యక్తికి చెప్పలేనందుకు ఫీలై.. ఇప్పుడు ఆ ప్రయత్నం చేద్దాం అనుకుని ఇద్దరూ కలిసి రంగంలోకి దిగుతారు. ఇదీ ఈ సినిమా కథ. ఆహ్లాదకరమైన కథనం, సన్నివేశాలతో సినిమాను ఆద్యంతం హుషారుగా నడిపించడంతో యూత్ ఈ చిత్రానికి బాగా కనెక్ట్ అవుతున్నారు.

# నేను గెలిచిన సింహాన్ని.. గాయపడిన సింహాన్ని కాదు!




డైరెక్టర్‌గా తనదైన ముద్ర వేసుకున్న తరుణ్ భాస్కర్, ఓ వైపు డైరెక్టర్‌గా విభిన్న కథలతో సినిమాలను తెరకెక్కిస్తూనే, మరోవైపు నటుడిగా కూడా ఆడియన్స్‌ను మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. రీసెంట్‌గా ఓం శాంతి శాంతి శాంతిః సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చిన తరుణ్ భాస్కర్, ఇప్పుడు గాయపడ్డ సింహం సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. ఆకట్టుకుంటున్న గాయపడ్డ సింహం టీజర్ గాయపడ్డ సింహం అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తుండగా ఇందులో ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేస్తూ చిత్ర యూనిట్ ప్రెస్‌మీట్‌ను నిర్వహించింది. టీజర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉండగా, ఈ ప్రెస్‌మీట్‌లో తరుణ్ భాస్కర్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టీజర్‌ను బట్టి చూస్తుంటే సినిమాలో హీరోకి చిన్నప్పటి నుంచే అమెరికా వెళ్లాలనే కోరిక ఉంటుంది. ఆ కోరికను నెరవేర్చుకోవాలనే టైమ్‌కు సరిగ్గా ట్రంప్ వీసాలు ఆపేయడంతో సినిమా మొత్తం వీసా కోసం చేసే పోరాటం లాగా కనిపిస్తోంది. అయితే ఈ ప్రెస్‌మీట్‌లో తరుణ్‌కు ఓ జర్నలిస్ట్ నుంచి చూస్తుంటే మీరు వీసా కోసం కాదు, సక్సెస్ కోసం గాయపడ్డ సింహంలాగా పోరాడుతున్నారనిపిస్తుందని అడిగారు. దానికి తరుణ్ ఇచ్చి సమాధానం అందరినీ ఆకర్షిస్తోంది. సక్సెస్ అనేది రిలేటబుల్ థింగ్ అని, సక్సెస్ అంటే మీరు బాక్సాఫీస్ చూస్తారు, కానీ నేను మాత్రం ఆడియన్స్ మనసు చూస్తున్నానని, అలా చూసుకుంటే నేను ఇప్పటికే గెలిచానని, ఆల్రెడీ సక్సెస్ అని కాకపోతే ఆ విషయం మీకు తెలియడం లేదని చెప్తూ దానికి ఓ ఉదాహరణను కూడా జోడించారు తరుణ్. తాను మారేడుపల్లిలో టీ తాగేవాడినని, అలాంటి తాను ఇవాళ స్టేజ్‌పై జర్నలిస్టులతో ప్రశ్నలు అడిగించుకునే స్థాయికి వచ్చానంటే అది చాలా పెద్ద సక్సెస్ అని, తాను గాయపడ్డ సింహం కాదని, తాను గెలిచిన సింహమని చెప్పడంతో అక్కడివారంతా తరుణ్ ఆన్సర్‌కు ఆశ్చర్యపోగా, సదరు జర్నలిస్ట్ మాత్రం తరుణ్ స్పోర్టివ్ స్పిరిట్‌ను అభినందించారు. తరుణ్ చెప్పిన మాటలు ప్రస్తుతం యంగ్ డైరెక్టర్లు, మూవీ లవర్స్‌లో స్ఫూర్తిగా నింపగా, సక్సెస్‌ను కేవలం కలెక్షన్లతో కాకుండా, వ్యక్తిగత ఎదుగుదల, ఆడియన్స్ ప్రేమతో కొలవాలనే తరుణ్ దృక్పథాన్ని అందరూ అభినందిస్తున్నారు. ఇక సినిమా విషయానికొస్తే టీజర్‌తోనే ఈ సినిమాపై అందరికీ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మరి ఈ సినిమా తరుణ్‌కు ఎలాంటి ఫలితాన్నిస్తుందో చూడాలి.

# స్పిరిట్.. ప్రకాష్ రాజ్ ఇచ్చిపడేశాడుగా..



సందీప్ రెడ్డి వంగా ప్రభాస్ కాంబినేషన్ పై అంచనాలు ఏ రేంజ్‌లో ఉన్నాయో అందరికీ తెలిసిందే. 'స్పిరిట్' మూవీ అనౌన్స్ చేసినప్పటి నుంచి ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తూనే ఉంది. ముఖ్యంగా ఈ సినిమాలో నటించే కాస్టింగ్ విషయంలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్న తరుణంలో ఒక ఇంట్రెస్టింగ్ మ్యాటర్ బయటకు వచ్చింది. సాధారణంగా పెద్ద సినిమాల విషయంలో గాసిప్స్ రావడం చాలా కామన్. కానీ కొన్నిసార్లు అవి హద్దులు దాటి నెగెటివ్ వైబ్‌ని క్రియేట్ చేస్తాయి. గత కొద్ది రోజులుగా స్పిరిట్ సెట్స్‌లో గొడవలు జరుగుతున్నాయని, ఒక స్టార్ నటుడు ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని నెట్టింట తెగ ప్రచారం జరిగింది.

దర్శకుడికి నటుడికి మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ వచ్చాయంటూ రకరకాల కథనాలు పుట్టుకొచ్చాయి. అసలు ఏం జరుగుతుందో తెలియక ఫ్యాన్స్ కూడా కన్ఫ్యూజన్‌లో పడ్డారు. అసలు పాయింట్ ఏంటంటే.. నటుడు ప్రకాష్ రాజ్ ఈ సినిమా నుంచి ఎగ్జిట్ అయ్యారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వార్తలపై ఆయన స్వయంగా స్పందించారు. ఈ వార్తలను 'ఫేక్ న్యూస్'గా కొట్టిపారేస్తూ గట్టి కౌంటర్ ఇచ్చారు. అసలు తన సీన్ల షూటింగ్ ఇంకా మొదలే కాలేదని, అప్పుడే తప్పుకున్నట్లు వార్తలు ఎలా రాస్తారంటూ మండిపడ్డారు. వాట్సాప్ ఫ్యాక్టరీల్లో ఇలాంటి కట్టుకథలు అల్లడం మానుకోవాలని చురకలు అంటించారు. ప్రకాష్ రాజ్ ఇచ్చిన క్లారిటీతో ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడినట్లయింది. ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. గొడవలు జరిగాయని, సీరియస్ టెన్షన్స్ ఉన్నాయని వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. ప్రభాస్‌లాంటి బిగ్ స్టార్ సినిమాలో ప్రకాష్‌రాజ్‌లాంటి నటుడు ఉండటం ప్లస్ అవుతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక ముందుగా రూమర్స్ ఎన్ని వచ్చినా కూడా మేకర్స్ కూడా ఈ విషయంలో పెద్దగా క్లారిటీ ఇచ్చింది లేదు. ఇక షూటింగ్ ఆల్రెడీ ట్రాక్‌లో ఉందని, షెడ్యూల్స్ పక్కాగా జరుగుతున్నాయని తెలుస్తోంది. ప్రకాష్‌రాజ్ సీన్స్ త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ప్రభాస్‌ని ఒక పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా చూడాలని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. ఏదేమైనా స్పిరిట్ సినిమా చుట్టూ జరుగుతున్న ఈ హైప్ చూస్తుంటే బాక్సాఫీస్ దగ్గర ప్రకంపనలు ఖాయమనిపిస్తోంది. ప్రకాష్ రాజ్ ఇచ్చిన రియాక్షన్‌తో నెగెటివ్ ప్రచారానికి బ్రేక్ పడింది. ఇక వచ్చే ఏడాది ఈ సెన్సేషనల్ ప్రాజెక్ట్ థియేటర్లలోకి వచ్చే ఛాన్స్ ఉంది. ప్రకాష్ రాజ్ క్యారెక్టర్ సినిమాలో ఏ రేంజ్‌లో ఉండబోతుందో చూడాలి.

# స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి విపక్షాలు సన్నద్ధం



**న్యూఢిల్లీ:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంతో ఇటు అధికార పక్ష సభ్యులు, అటు విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తి చేస్తున్నారు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉభయసభల కార్యకలాపాలకు తరచు అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడేందుకు అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లాపై అవి శ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో విపక్షాలు ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవి శ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 8న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్పీ) తదితరల పార్టీల ఎంపీలు పాల్గొన్నట్టు చెబుతున్నారు.

**ఓం బిర్లాకు కాంగ్రెస్ మహిళా ఎంపీలు లేఖ**

మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై దాడికి సిద్ధమయ్యామంటూ తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఖండించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము నిరసన తెలిపామని, హింసకు దిగాలని తాము అనుకోలేదని, విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేకపోవడం వల్లే భయపడి సభకు రాలేదని మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసి మరీ 8 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, మాజీ ప్రధానులపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి, పలువురు మహిళా ఎంపీలు ఈ లేఖపై సంతకాలు చేశారు.

# టీటీడీ లడ్డూ వ్యవహారం.. హిందూ ధార్మిక సంఘాల నిరసన



**తిరుపతి, (రాజధాని వార్తలు):** అలిపిరి గరుడ సర్కిల్ వద్ద హిందూ ధార్మిక సంఘాలు సోమవారం నిరసనకు దిగాయి. వైసీపీ హయాంలో తిరుమలలో చేసిన పాపాలు ఒప్పుకోవాలంటూ నినాదాలు చేశాయి. టెంకాయలు కొట్టి క్షమించు దేవుడా అంటూ వేడుకున్నాయి. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసిన హిందూ ద్రోహులను క్షమించకూడదని హెచ్చరించాయి. ఏడుకొండల స్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వైసీపీని ప్రజలు స్వచ్ఛందంగా బహిష్కరించాలని పిలుపునిచ్చాయి. స్వామివారి లడ్డూ ప్రసాదం కల్తీ పాపం కాదని.. మహా పాపమని హిందూ ధార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రసాదం కల్తీ చేయడమంటే భక్తుల విశ్వాసంపై దాడి చేసినట్లేనని చెప్పుకొచ్చాయి. కుట్రపూరితంగా కల్తీ చేసిన గత వైసీపీ ప్రభుత్వానికి హిందువులే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చాయి. తిరుమల క్షేత్రంపై జరిగిన కుట్రలపై విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. తిరుమలపై దాడి జరిగితే హిందువులంతా గొంతెత్తాలని, వైసీపీ నేతలు వేంకటేశ్వరస్వామికి, శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి. కల్తీ నెయ్యి వ్యవహారంపై త్వరలోనే రాష్ట్రపతిని కలుస్తామని హిందూ ధార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.

# వేదాంత విజిసిబి పోర్ట్ సహకారంతో నిర్మించిన శెట్టిబలిజ కమ్యూనిటీ భవనం ను పునః ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**- ఎమ్మెల్యే వంశీకృష్ణ చొరవతో ఏడు లక్షల వ్యయంతో ఆధునీకరణ చేసిన వేదాంత కంపెనీ**

**- నియోజకవర్గంలో ముఖద్వారాలు, సామజికభవనాలు నిర్మాణంలో గణనీయమైన పురోగతి - ఎన్నికల హామీలో భాగంగా సామాజిక భవన నిర్మాణాలకు, ముఖ ద్వారాల నిర్మాణాలకు పెద్దపీట వేసిన ఎమ్మెల్యే**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వేదాంత విజిసిబి పోర్ట్ సహకారంతో 39వ వార్డు పరిధిలో పద్మా నగర్ వద్ద శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ పునః ప్రారంభోత్సవ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా సామాజిక భవనాల రూపురేఖలను మారుస్తున్నామని అదేవిధంగా కొత్తగా పలు సామాజిక భవనాలు ప్రారంభించే దిశగా అడుగు వేస్తున్నామని తెలియజేశారు. ప్రజల అభివృద్ధి ప్రజల యొక్క ఆకాంక్ష మేరకు పలు నిర్మానాలతో పాటు సామాజిక భవనాలను ఏర్పాటులో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని తెలియజేశారు. శెట్టిబలిజ సామాజిక వర్గం నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యమైనదని వారు ఎన్నికల సమయంలో అన్ని విధాలుగా సహకరించారనీ వారిని ఎన్నటికీ మర్చిపోలేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏడు లక్షల వ్యయంతో ప్రజా అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టారని, ఫ్లోరింగ్, విద్యుత్ ఏర్పాట్లు, లైటింగ్ తో పాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారని తెలిపారు. శెట్టి బలిజ సామాజిక భవనం పునః నిర్మాణానికి సహకరించిన వేదంత ,విజిసిబి పోర్ట్ సహకారానికి అదేవిధంగా జీవీఎంసీ సహకారం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, స్థానిక కార్పొరేటర్ సాధిక్, ఎస్ కే ఎంఎల్ మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, స్థానిక పెద్దలు శ్రీనివాస్, దానేష్, రాజు, ఇల్లా రాజు, కోటమ్మ, ప్రణీత్, కొండబాబు, తాతారావు, మసేన్, రాజుతో పాటు జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, కార్పొరేటర్ అప్పారీ గిరిబాబు, పెద్దలు కృష్ణ గౌడ్, గణేష్, సి ఎస్ ఆర్ హెడ్ లక్ష్మీ, ఆపరేషన్ హెడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# పెనుగుదురులో ఆయుర్వేద వైద్య శిబిరం



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం, పెనుగుదురు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గురజనాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి డాక్టర్ దివ్య నేతృత్వం వహించారు. శిబిరంలో 80 మందికి పైగా స్థానిక ప్రజలు పాల్గొని రక్తపోటు (బీపీ), షుగర్ వంటి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఎమ్మెల్యే పంతం నానాజీ, జనసేన మండల అధ్యక్షుడు బండారు మురళికి, కూటమి నాయకులకు, డాక్టర్ దివ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద సిబ్బంది ఎం.ఎస్.కృష్ణమూర్తి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ పనితీరుపై సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్రశంసలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమీక్షా సమావేశంలో స్త్రీ శక్తి పథకం విజయవంతమైన అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ పనితీరుపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ఈ ప్రశంసలపై సంతోషం వ్యక్తం చేసిన మంత్రి మండిపల్లి.. తమకు బాధ్యత మరింత పెరిగిందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 4 కోట్ల మంది మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణ సేవలను ఏపీఎస్ ఆర్టీసీ విజయవంతంగా అందించిందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. స్త్రీ శక్తి పథకాన్ని కేవలం బరువుగా కాకుండా బాధ్యతగా స్వీకరించి సేవలు అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన సేవలను మహిళలకు అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఓటుకు నోటు కేసు సాక్ష్యాలను కాల్చేశారు.. కేటీఆర్ షాకింగ్ కామెంట్స్



**జయశంకర్ భూపాలపల్లి, (రాజధాని వార్తలు):** సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఓటుకు నోటు కేసు సాక్ష్యాలను కాల్చేశారని ఆరోపించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. అనుచిత వ్యాఖ్యలు చేసే సీఎం రేవంత్‌రెడ్డికి పోలింగ్ కేంద్రంలోనే బుద్ధి చెప్పాలని అన్నారు. 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. భూపాలపల్లి సింగరేణిని ఆగం చేసేందుకు చూస్తున్నారని ఆరోపణలు చేశారు. తులం బంగారం, రూ.4వేల పెన్షన్ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలని అన్నారు. కేసీఆర్ పథకాలు తీసుకుంటున్న వాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఇవ్వాళ, రేపు మద్యం, డబ్బులు పంచి ఓట్లు వేయించుకోవాలని చూస్తారని ఎద్దేవా చేశారు. మరోసారి మోసపోయి భస్మాసుర చేయి లాంటి కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని సూచించారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆగ్రహించారు. 12 ఏళ్లలో తెలంగాణకు బీజేపీ నయాపైసా పనిచేయలేదని ఫైర్ అయ్యారు.

**కేటీఆర్ పర్యటనలో ఉద్రిక్తత..**

జయశంకర్ భూపాలపల్లిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి కేటీఆర్ వచ్చారు. ఆయన పర్యటనలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేటీఆర్ కార్నర్ మీటింగ్ సందర్భంగా సామాజిక కార్యకర్త, దివంగత రాజలింగమూర్తి ఫ్లెక్సీ తొలగించారు. కేటీఆర్ కార్నర్ మీటింగ్ నేపథ్యంలో రాజలింగమూర్తి ఫ్లెక్సీ తొలగింపుపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తండ్రి ఫ్లెక్సీని కావాలనే బీఆర్ఎస్ నేతలు తొలగించారంటూ రాజలింగమూర్తి కుమార్తె ఆరోపించారు. ఈ క్రమంలో రాజలింగమూర్తి కుమార్తె రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మా నాన్నను బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, గండ్ర వెంకటరమణారెడ్డి, హరిబాబు కలిసి హత్య చేశారని ఆమె ఆరోపించారు.

# లవ్ జిహాద్ టైపులో.. లడ్డూ జిహాద్ జరిగిందేమో : శ్రీనివాసానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు చేశారు. లవ్ జిహాదీ టైపులో లడ్డూ జిహాద్ జరిగిందేమోననే అనుమానం తమకు ఉందన్నారు. వైసీపీ హయాంలో లడ్డూని కల్తీ చేశారని ధ్వజమెత్తారు. ఇంతవరకు ఎప్పుడూ లడ్డూ వివాదం లేదని, జగన్ హయాంలో తిరుపతి లడ్డూ నాణ్యత లేదని..ఇది అన్యమతస్తుల కుట్ర అని ధ్వజమెత్తారు. తిరుమల లడ్డూను హిందువులు పరమ పవిత్రంగా భావిస్తారని...ఈ విషయంలో తాము చాలా బాధపడుతున్నామని తెలిపారు. జగన్ పాలనలో తిరుపతి లడ్డూపై చర్చ జరిగిందని ప్రస్తావించారు. లడ్డూ కల్తీ జరిగిందని కూటమి నాయకులు మాట్లాడినప్పుడు తాము పట్టించుకోలేదని అన్నారు. తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని సీబీఐ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. సోమవారం విశాఖపట్నంలో శ్రీనివాసానంద సరస్వతి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

**సిట్ రిపోర్టుతో భయాందోళన..**

సిట్ రిపోర్టుతో తాము భయాందోళనకు గురయ్యామని, సిట్ నివేదికతో హిందువులు ఆందోళన చెందుతున్నారని శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. రూ.20 కోట్ల లడ్డూలు కల్తీ అయ్యాయని సీబీఐ తేల్చిందని చెప్పుకొచ్చారు. పవిత్రమైన లడ్డూలో ఫుడ్ మాఫియా జరిగిందని ఆరోపించారు. రసాయనాలు కలిసిన లడ్డూ తిని భక్తులు అనారోగ్యాలు పాలయ్యే అవకాశం ఉందని అన్నారు. లడ్డూ కల్తీపై సీబీఐ రిపోర్ట్ ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పు చేసినవారు వేంకటేశ్వర స్వామి శిక్ష నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. రెండు కొండలు అన్న రాజశేఖర్ రెడ్డికి ఎంత శిక్ష పడిందో అందరూ చూశారని ప్రస్తావించారు. దయచేసి లడ్డూ వ్యవహారాన్ని రాజకీయం చేయొద్దని సూచించారు. సిట్ రిపోర్ట్ ఆధారంగా తక్షణమే ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లడ్డూ కల్తీపై అప్పటి పాలకవర్గం నైతిక బాధ్యత వహించాలని, హిందూ సమాజానికి వెంటనే జగన్ అండ్ కో క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిట్ రిపోర్టుపై నమ్మకం లేదని వైసీపీ నేతలు అనడం విడ్డూరంగా ఉందని స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఎద్దేవా చేశారు.

# పరిశ్రమలకు భూముల్ని వెంటనే అందజేయాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పరిశ్రమలకు అవసరమైన భూములను వెంటనే ఇచ్చేందుకు రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఎం.ఓ.యూ చేసుకున్న కంపెనీల ప్రోగ్రెస్ పై సమీక్షించారు. ప్రస్తుతం 10 కంపెనీ లకు భూములు కేటాయి0చవలసి ఉందని, అక్కడ గ్రామ సభలు ఏర్పాటు చేసి తీర్మానం చేసి సోమవారానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్.కోట లో ప్రతిపాదించిన ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ కోసం కేటాయించిన బ్లాక్స్ ను కేటగిరీ వారీగా కేటాయించి, ఏ బ్లాక్ లో ఏ యూనిట్ కేటాయించారు అనే వివరాలను మంగళవారం నాటికి అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జె.సి సేదు మాధవన్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్, విజయనగరం చీపురుపల్లి ఆర్.డి.ఓలు కీర్తి, రామ్మోహన్ రాములు హాజరయ్యారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎస్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లూబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# పి.లక్ష్మివాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి సస్పెన్షన్

## - అమలాపురంలో హెచ్‌ఎంగా పనిచేసిన సమయంలో నిధులు పక్కదారి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పి.లక్ష్మివాడ జిల్లా పరిషత్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న యస్.రాజేశ్వరీ దేవిని విద్యాశాఖ అధికారులు విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ చర్యకు సంబంధించి అధికారి కంగా వెల్లడించిన వివరాల ప్రకారం ఆమె గతంలో అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పాఠశాలకు సంబంధిం చిన నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఎదురయ్యాయి. ఈ ఆరోపణలపై విద్యాశాఖ అధికా రులు ప్రాథమికంగా విచారణ చేపట్టగా పలు ఆర్థిక లావాదేవీల్లో జరిగిన అవకతవకలను గుర్తించినట్లు సమాచారం. తదనంతరం పూర్తి స్థాయి శాఖాపరమైన విచారణ నిర్వహించగా నిధుల వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు నిర్ధారణకు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శాఖా నియమావళి ప్రకారం క్రమశిక్షణాత్మక చర్యగా రాజేశ్వరీదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత అధికా రులు వెల్లడించారు. పాఠశాల నిధులు విద్యార్థుల అభివృద్ధి, పాఠశాల అవసరాల కోసం మాత్రమే వినియోగించాల్సి ఉండగా వాటి వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను అధికారులు సీరియస్‌గా తీసు కొని విచారణ జరిపినట్లు తెలిపారు. విచారణలో బయటపడిన అంశాల ఆధారంగా ఆమెపై నమోదైన ఆరోపణలు నిజమని తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సస్పెన్షన్ అనంతరం ఆమెపై మరిన్ని శాఖాపరమైన చర్యలు కొనసాగనున్నాయని అవసరమైతే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది.

# సీఎం అధ్యక్షతన కీలక సమీక్షా సమావేశం.. ఫలితాలే ముఖ్యమన్న డిప్యూటీ సీఎం

**అమరావతి, (రాజధాని వార్తలు):** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులతో కీలక సమీక్షా సమావేశం సోమవారం ప్రారంభమైంది. సీఎస్ కె.విజయానంద్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. పల్లె పండగ కార్యక్రమం కింద గత ఏడాది రూ.2,500 కోట్లు మంజూరు చేస్తే, ఇప్పుడు 2.0 కింద రూ. 5,700 కోట్లు, అడివితల్లి బాటకు రూ.1,005 కోట్లు, సాస్కికి రూ.2,123 కోట్లు.. మొత్తం రూ.11,328 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. జలజీవన్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర షేర్లతో పనులు జరుగుతున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే రూ.10 వేల కోట్ల పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ఉన్న తక్కువ వనరులను ఉపయోగించుకొని ఎక్కువ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని సహాయ సహకారాలు, ముఖ్యమంత్రి అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. ప్రతి రూపాయి క్షేత్రస్థాయిలో కనిపించాలని... ప్రాజెక్టులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఉదాసీనత ఉంటుందన్నారు డిప్యూటీ సీఎం. ముఖ్యమంత్రి ఇచ్చిన టార్గెట్‌లు రీచ్ కావలంటే చాలా వరకూ ఎక్స్క్యూజెస్ కనిపిస్తున్నాయని తెలి పారు. ముఖ్యమంత్రి, తాను అకౌంటబిలిటీ ఫిక్స్ చేసుకుంటున్నా మని.. అందుకే క్షేత్ర స్థాయిలో ఫలితాలు రావాలని కోరుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.



**చర్చించే అంశాలివే..**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో జీఎస్డీపీ వృద్ధి రేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధన కోసం పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖల పురోగతిపై సమీక్షించనున్నారు. 2026-27లో కేంద్ర ప్రాయోజిత పథకాల కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు సీఎం. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్ సిస్టమ్, పాలనలో ఏఐ టూల్స్, ఇతర సాంకేతికతల వినియోగంపై సమావేశంలో చర్చ జరగనుంది. అలాగే నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్ విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, రాష్ట్రంలో శాంతిభద్రతల అంశాలపై సీఎం సమీక్ష చేపట్టనున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్‌గా పాల్గొన్నారు.





**ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా, 04.02.2026న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా డాక్టర్ పూర్ణ రాజేశ్వరి రచించిన 'క్యాన్సర్‌ను ఎలా నివారించాలి, క్యాన్సర్‌కు కారణమయ్యే కారకాలు' అనే పుస్తకం ఆవిష్కరణ.**

# రిటైర్డ్ డ్రైవర్‌ను సత్కరిస్తున్న ఏపిఎంపిఏ నాయకులు



**మచిలీపట్నం, (రాజధాని వార్తలు):** సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తు ఇటీవల రిటైర్డ్ అయిన శ్రీ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మరియు సీనియర్ జర్నలిస్ట్లు మరియు కృష్ణ జిల్లా మీడియా అక్రిడిషన్ కమిటీ సభ్యులు మన్నే సోమేశ్వరరావు మత్తి శ్రీకాంత్ జీ.శ్యామ్ బాబు మరియు ఏపిఎంపిఏ రాజు, రామక్రిష్ణ తదితరులు.

# పసలేని వైసీపీ వితండవాదం

నలుగురూ నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్టుగా ఉంది వైసీపీ పరిస్థితి.వైఎస్ వివేకా డెత్ మిస్టరికి సంబంధించి గొడ్డలి వేటును గుండెపోటుగా ఏమర్చాలని యత్నించి విఫలమైన వైసీపీ తిరుమల లడ్డూ విషయంలోను అదే వితండవాదానికి తెరలేపడమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అసలు అది నెయ్యే కాదు.! అలాంటప్పుడు కల్తీ నెయ్యి.. అని ఎలా అంటాం.? ఇదీ వైసీపీ క్యాడర్ తోపాటు వైసీపీ అను'కుల' మీడియా కూడ చేస్తున్న వాదనలో అసలు పసలేదు. జరిగిన తప్పును ఒప్పుకుని క్షమాపణ చెప్పాల్సిందిపోయి నిసిగ్గుగా ఎదురు దాడి చేస్తుండడంతో భక్తులు సైతం నివ్వెరపోతున్నారనడంలో సందేహం లేదు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి అనగానే ముందుగా గుర్తుకొచ్చేది, 'మహా ప్రసాదం' అయిన 'లడ్డూ'.! వెంకటేశ్వర స్వామిని ఎంత భక్తితో కొలుస్తామో, ఆ లడ్డూ ప్రసాదం పట్ల కూడా హిందువులు అంతే, భక్తితో వుంటారు. మార్కెట్లో స్వీట్ షాపుల్లో దొరికే సాధారణ లడ్డూ కాదు, లడ్డూ ప్రసాదమంటే. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడి పడింది వెంకన్న లడ్డూ ప్రసాదం. అలాంటి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని వైసీపీ హయాంలో వినియోగించారన్నది ప్రధాన ఆరోపణ. ఓ నివేదిక ఆధారంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన,అప్పట్లో అందర్నీ విస్మయానికి గురి చేసింది. ప్రభుత్వాధినేతగా, తన రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయంలో జరిగిన కల్తీ నెయ్యి వ్యవహారంపై ముఖ్యమంత్రి ప్రకటన చేయడమే కాదు, విచారణకు కూడా ఆదేశించడంతో వైసీపి బాగోతం బట్టబ



యలు అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనుక స్పందించకపోయి ఉంటే వైసీపి కల్తీ కుట్రల వ్యవహారం వెలుగులోకి వచ్చి ఉండేది కాదు. భక్తుల మనోభావాలను కాపాడాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి జాతీయ స్థాయిలోనే ప్రశంసలు లభిస్తే వైసీపీ మాత్రం తన తప్పును కప్పు పుచ్చుకునే యత్నంలో ఎదురుదాడితో కాలక్షేపం చేయడాన్ని భక్తులు హేళన చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటిదాకా చాలా అరెస్టులు జరిగాయి.. కల్తీ నిజమని, దర్యాప్తు సంస్థ ఆల్రెడీ తేల్చింది. అయితే, నెయ్యి అస్సలు వాడకుండా, రసాయనాలతో నింపేశారన్నది సిట్ బృందం తేల్చిన అంశం. అద్దదీ అసలు సంగతి.. నెయ్యే వాడలేదు కాబట్టి, కల్తీకి ఆస్కారమేది.? అంటూ వైసీపీ క్యాడర్, వైసీపీ అను'కుల' మీడియా చిత్రమైన వాదనను సిగ్గు లేకుండా తెరపైకి తెస్తున్నాయి. అంతలోనే, ప్రత్యేక దర్యాప్తు బృందం లడ్డూ ప్రసాదంలో స్వచ్ఛమైన నెయ్యినే వాడినట్లు తేల్చిందంటూ అదే వైసీపీ క్యాడర్, వితండవాదానికి తెరలేపడం గమనార్హం. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంతో డబ్బు దోచుకోవడంతో పాటు శ్రీవారి పవిత్రత దెబ్బతీయాలనేదే గత పాలకుల అసలైన కుట్రహాంబహిర్గతం అయింది. అయినప్పటికీ వైసీపీ నాయకులలో పశ్చాతాపం కనపడకపోగా దుష్ప్రచారానికి ఎగబడతూ ఇంకా మహాపాపాన్ని మూట గట్టుకుంటున్నారు. గత పాలనలో తిరుమల విషయంలో ఘోర అపచారానికి పాల్పడ్డారు. భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. 2022లో సీఎఫ్‌టీఆర్ఐ చాలా స్పష్టంగా కల్తీ జరుగుతోందని చెప్పినా పట్టించుకోకుండా యథేచ్ఛగా కొనసాగించారు. అదే కల్తీ నెయ్యిని వాడిన లడ్డూను లక్షల మంది భక్తులకు ప్రసాదంగా ఇచ్చి గత పాలకులు మహా పాపానికి పాల్పడ్డారు. గత ఐదేళ్లలో లడ్డూ ప్రసాదం తినాలంటేనే భక్తులు భయపడిన పరిస్థితి ఉండేది. మానసికంగా ఇబ్బందులు పడ్డారు. 2022లో వచ్చిన నివేదికను తొక్కిపెట్టారు. ఉద్దేశపూర్వకంగా అక్రమాలు చేయడానికే గత పాలకులు నాటి నివేదికను దాచేశారన్న సంగతి లోకం కోడై కూసున్న గాని వైసీపీ నాయకులు మాత్రం అసత్య ప్రచారాలతో నవ్వులపాలవుతున్నారు. వైసీపీ పాలనలోభగవంతుడు అంటే లెక్కలేనితనంగా వ్యవహరించారు. హైందవం పట్ల జగన్‌కు విశ్వాసం లేదు. తిరుమల లడ్డూ విషయంలో దుర్మార్గం, మహా పాపం చేశారు. చరిత్రలో శ్రీవేంకటేశ్వర స్వామితో ఎవరూ ఆటలాడుకోలేదు. బ్రిటీషర్లు కూడా సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించారు. వాళ్లకంటే హీనంగా గత పాలకులు వ్యవహరించారు. నాడు లడ్డూ కల్తీకి పాల్పడిందే కాక ఇప్పుడు మళ్లీ ఎదురు దాడి చేసి, జరిగిన ఘటనను డైవర్ట్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. సీబీఐ నివేదికలో కల్తీ లేదని ఎక్కడా నిర్ధారించలేదు. కరడు గట్టిన నేరస్థులు అసత్యాన్ని కూడా నిజంగా నమ్మించేందుకు ప్రయత్నిస్తారు. ఇప్పుడు వైసీపీ అదే పని చేస్తోంది. హిందూ విశ్వాసాల మీద జరిగిన దాడి. తప్పు చేసిన వైసీపీ వారు ఏడుకొండల వాడికి క్షమాపణ చెప్పి తీరాల్సిందే. లేకపోతే ఖర్మ అనేది వారిని వెంటాడడం ఖాయం.

**వాసంశెట్టి సుభాష్,**
కార్మికశాఖ మంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## మానవ జన్మ సార్థకత కావాలంటే సమాజం హితం కోసం మనం బ్రతకాలి : మానవత స్టేట్ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు

**హనుమాన్ జంక్షన్, (రాజధాని వార్తలు):** మానవ జన్మకు సార్థకత చేకూరాలంటే వయసు వచ్చిన తరువాత మనకోసం కాదు సమాజం కోసం బ్రతకాలని ఉమ్మడి కృష్ణాజిల్లా సెంట్రల్ కమిటీ చైర్మన్, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లా మానవతా కార్యవర్గ సమావేశం హనుమాన్ జంక్షన్ మానవతా కార్యాలయంలో కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగినది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మారుబోయిన మాట్లాడుతూ 50 లక్షలతో ఏర్పాటు చేయు విద్యానిధి గురించి విధి విధానాలు తెలిపి అందరి సభ్యుల సూచనలు తీసుకొని నిబంధనలను రూపొందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరు వీర శేషగిరిరావు సోదాబత్తుల నాగేశ్వరరావు, రక్తనిధి కమిటీ చైర్మన్ పి కృష్ణ ప్రసాద్, జిల్లా కార్యదర్శి జెన్యావుల వీర వెంకట సత్యనారాయణ, ట్రెజరర్ అన్నపురెడ్డి గోపిరెడ్డి అన్ని



మండలాల ప్రధానులు సమన్వయ కమిటీ డైరెక్టర్లు పర్యావరణ కమిటీ డైరెక్టర్లు కెరీర్ గైడెన్స్ కమిటీ డైరెక్టర్లు రక్తనిధి కమిటీ డైరెక్టర్లు చర్చలలో పాల్గొన్నారు.

# 17న డీ వార్మింగ్ డే



**గుంటూరు, (రాజధాని వార్తలు):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (డీ వార్మింగ్ డే)ను ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం కింద చేపట్టడం జరుగుతోందని చెప్పారు. అన్ని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో 17వ తేదీన ఉచితంగా ఇవ్వబడే అల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చన్నారు. గుంటూరు జిల్లాలో గల 1 నుండి 19 సంవత్సరం గల బాలబాలికలకు సుమారు 4,71,937మందికి మాత్రలు వేయడం జరుగుతుందని చెప్పారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమము రోజున డీవార్మింగ్ జరగని పిల్లలకు ఫిబ్రవరి 24వ తేదీన జరిగే మాప్-అప్ రోజున అల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రను వేయాలని తెలిపారు.

**వయస్సు వారి డోసుల వివరాలు**

1 సంవత్సరం నుండి 2 సంవత్సరములు వయస్సు గల పిల్లలకు సగము మాత్రను నీటిలో కరిగించి త్రాగించాలి. 2 నుండి 3 సంవత్సరములు వయసు గల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి త్రాగించాలి. 3 నుండి 19 సంవత్సరము వయసు గల వారికి పూర్తి మాత్రను చప్పరించేటట్లు చూడాలి. మద్యాహ్నం భోజనం చేసిన అరగంట తరవాత మాత్రలను వేయాలి. నులిపురుగులు ఉంటే పోషకాహార లోపం, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు కలుగుతాయని చెప్పారు. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి రుగ్మతలు ఉంటాయన్నారు. పిల్లలకు నులిపురుగుల నిర్మూలన వలన రక్తహీనతను నివారిస్తుందని, పోషకాల గ్రాహ్యతను మెరుగుపడుతుందని, చదువుపై ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. పరిసరాలలో నులిపురుగుల వ్యాప్తిని తగ్గించి సమాజానికి మేలు చేస్తుందన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.కే.విజయలక్ష్మి మాట్లాడుతూ నులిపురుగుల నుండి రక్షణకు శుభ్రత పాటించాలన్నారు. కూరగాయలు, పళ్ళను శుభ్రమైన నీటితో కడగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బూట్లు, చెప్పులు ధరించాలని, బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదని, ఎప్పుడూ మరుగుదొడ్డిని ఉపయోగించాలని సూచించారు. ఏదైనా తినడానికి ముందు, తరువాత., మరుగుదొడ్డి వాడిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడగాలని చెప్పారు. మాత్రను చప్పరించి లేదా బాగా నమిలి శుభ్రమైన నీటితో మింగాలని తెలిపారు. నులి పురుగుల మాత్ర వలన ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ఎవరికైన వికారం, కనుపు నొప్పి వంటి సమస్యలు వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలపై సీఎంకు గాండ్ల తెలికుల జేఏసీ వినతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అఖిల గాండ్ల తెలికుల సమస్యలపై సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గాండ్ల తెలికుల దేవతిల కుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ప్రతినిధులు శనివారం అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జేఏసీ పక్షాన తమ న్యాయమైన డిమాండ్లతో వినతి పత్రాన్ని ముఖ్యమంత్రికి అంద జేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న గాండ్ల తెలికుల, దేవతిలకుల కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని, చైర్మన్‌తో పాటు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను నియమించాలని, అవసరమైన నిధులు మరియు విధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే తమ కులస్తులు నడుపుతున్న కరెంటు గానుగులకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రాయితీ కల్పించాలని, రాష్ట్ర రాజధాని ప్రాంతంలో మరియు జిల్లా కేంద్రాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి స్థలాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును వినతిపత్రంలో వారు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు వినిపించిన డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై స్పందించిన ముఖ్యమంత్రికి జేఏసీ పక్షాన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు నాయుడును కలిసిన వారిలో జేఏసీ జనరల్ సెక్రెటరీ బుర్ర మధుసూదన్, రాష్ట్ర నాయకులు నరవ అనంతం, అడ్డ వీర వెంకటరాజు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు గొట్టిపల్లి కనకదుర్గా శ్రీనివాస్, కార్యదర్శి కెల్ల ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## సర్వేలు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి : డిప్యూటీ ఎంపీడీఓ





**కరప, (రాజధాని వార్తలు):** సర్వేలు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంటి పన్నుల వసూలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ సలాది వెంకట శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. కరప మం డలం పెద్దాపురప్పాడు గ్రామంలో సలాది వెంకట శ్రీనివాసరావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంద ర్శించి గ్రామంలో జరుగుతున్న ఇంటి పన్నుల వసూలు ప్రక్రియను సమీక్షించారు. గ్రామంలో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ సర్వేల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం పెద్దాపురప్పాడు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. పరీక్షల దృష్ట్యా అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక అమలును పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా కష్టపడి చదివి వంద శాతం ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొండవీడు ఉత్సవాల్లో 'అమ్మ పేరిట మొక్క' కార్యక్రమం నిర్వహించిన సీబీసీ

### - వందేమాతరం ఫోటో ప్రదర్శనను సందర్శించిన కందుల దుర్గేష్, రాష్ట్ర ఉన్నతాధికారులు





**నర్సరావుపేట, (రాజధాని వార్తలు):** కొండవీడు ఉత్సవాల సందర్భంగా కేంద్ర సమాచార బ్యూరో (సీబీసీ) ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వరాహ నరసింహ స్వామి దేవస్థాన ప్రాంగణంలో 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కొండవీడు కోటలోని చారిత్రక 13వ శతాబ్దానికి చెందిన ఆలయ పూజాదికావసరాలను దృష్టిలో ఉంచుకుని, సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్ చంద్ర ఆలయ అర్చకులకు సలహా మేరకు ప్రత్యేక రకాల మొక్కలను నాటారు. కొండవీడు ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కేంద్ర సమాచార బ్యూరో ఏర్పాటు చేసిన 'వందేమాతరం - 150 సంవత్సరాలు' ఫోటో ప్రదర్శనను సందర్శించారు. చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, పల్నాడు జిల్లాకు చెందిన శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, డా.చదలవాడ అరవింద్ బాబు, జి.వి.ఆంజనేయులు, జాయింట్ కలెక్టర్ సంజన సింహ కూడా వందేమాతరం చిత్ర ప్రదర్శనను సందర్శించిన వారిలో వున్నారు. రెండు రోజుల కొండవీడు ఉత్సవాల్లో, వందేమాతరం 150 సంవత్సరాల విస్తృత ఛాయాచిత్ర ప్రదర్శన విద్యార్థులు, పెద్ద సంఖ్యలో సందర్శకులను విశేషంగా ఆకర్షించింది. నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, వందేమాతరం ప్రదర్శనలో పొందుపరిచిన సమాచారం, చిత్రాలు అత్యంత విజ్ఞానదాయకంగా, ప్రజలకు జాతీయ చైతన్యం కలిగించేవిగా ఉన్నాయని ప్రశంసించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985,
Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan